క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక పూజలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం చిప్పిలిలో వెలసిన సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఎ.అమరనాథ్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కోఆర్డినేటర్ శివశంకర్ తెలిపారు. ఆదివారం ఆలయంలో సత్యదేవ సదన్ భవన్ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన ఉదయం గణపతి పూజ,స్వస్తివాచనం, సహస్త లింగార్చన జరుగుతుందన్నారు. 11వ తేదీన సహస్రలింగార్చన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగద్గురు పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీ అభినవోద్దండ విద్యా శంకర భారతీ మహాస్వామి హాజరు కానున్నారన్నారు. సాయంత్రం విద్యా శంకర భారతీ స్వామి ప్రవచనాలు బోధిస్తారన్నారు. 12వతేదీన శ్రీసత్యదేవ సదన్ ప్రారంభించడం జరుగుతుందన్నారు.ఉదయం గోపూజ, గణపతిపూజ, నవగ్రహ ,రుద్ర, లక్ష్మీనారాయణ హోమాలు జరుగుతాయన్నారు. ఆలయ ఆవరణంలో విద్యాశంకర భారతి భక్తులకు అనుగ్రహణభాషణం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి భక్తులు హాజరై స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శివశంకర్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈఓకు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ఆదినారాయణరెడ్డి

కలికిరి: కలికిరికి చెందిన విశ్రాంత ఎంఈఓ ఆదినారాయణ రెడ్డికి బెంగళూరుకు చెందిన భారత్ వర్చువల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. గతంలో విద్యాశాఖాధికారిగా పని చేసిన ఆయన ప్రస్తుతం ప్రైవేటు పాఠశాల డైరెక్టర్‌గా విద్యారంగంలో రాణిస్తుండటంతో ఆయన సేవలను గుర్తించిన యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

ఉచితంగా సహరీ, ఇఫ్తార్

పీలేరు : పవిత్రమైన రంజాన్ మాసంలో వసతి లేని ఉపవాసం ఉండే ముస్లిం సోదరులకు స్థానిక మల్లెలవారి గ్రౌండ్ వద్ద ఉన్న అక్షా మసీదులో ఉచితంగా సహరీ, ఇఫ్తార్ ఏర్పాటు చేసినట్లు ముస్లిం మైనారిటీ నాయకులు అతికా షఫీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు వసతిలేని ఉద్యోగులకు, కార్మికులకు ప్రతి రోజూ 300 మందికి వసతి కల్పించడంతోపాటు ఉదయం, సాయంత్రం రుచికరమైన ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటి వద్ద వసతి పేద మహిళలు కూడా తమ నెంబర్‌కు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే ఉచితంగా ఆహారం సరఫరా చేస్తామని తెలిపారు. కావలసినవారు 9492378754 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పీర్ల చావిడికి భూమి పూజ

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డు పంచాయతీ కొత్తపేటలో ఆదివారం పీర్ల చావిడికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండపల్లి అక్కులప్ప భూమి పూజ చేశారు. వందేళ్ల నాటి చావిడి శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన నిర్మాణానికి గ్రామస్థుల సహకారంతో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పూల నాగేంద్ర, నారాయణ, ఈశ్వర్, ఖాదర్, జాకీర్, రమేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడుకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు



మాట్లాడుతున్న యమలా సుదర్శనం

పీలేరురూరల్ : మాలమహానాడు కమిటీకి ఎవరూ వ్యతిరేకంగా పని చేసినా ఉపేక్షించబోమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యమలా సుదర్శనం అన్నారు. ఆదివారం పీలేరులో నిర్వహించిన మాలమహానాడు ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంఘం నుంచి క్రమశిక్షణా చర్యలు ఉల్లంఘించిన రాయలసీమ మాల విద్యార్థి సంఘం నుంచి మలతోటి నరేష్‌ను తొలగించినట్లు తెలిపారు. తమ సంఘానికి వ్యతిరేకంగా ఎవరూ పనిచేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తమ్మల ధరణికుమార్, లక్ష్మీనారాయణ, జెట్టి మల్లికార్జున, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం సరే.. ఆచరణ ఏది?





మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రచార బ్యానర్, మార్కెట్‌యార్డులో యార్డు కార్యాలయం పరిసరాల్లోనే చెత్తకుప్పలు

గుర్రంకొండ: స్థానిక మార్కెట్‌యార్డులో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. పలుచోట్ల కుళ్లిపోయిన టమాటాలు, ఇతర వ్యర్థాలు ఇష్టానుసారంగా పడేస్తుండడంతో యార్డులో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రచారంలో ఉన్న శ్రద్ధ ఆచరణలో అధికారులు చూపించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానిక టమాటా మార్కెట్‌యార్డుకు ప్రతిరోజు రైతులు టమాటాలు తీసుకొస్తుంటారు. ఇదే మార్కెట్‌యార్డులో పలు తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, ఇతర వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసుకొన్నారు. నెలలో ప్రతి మూడవ శనివారం మార్కెట్లో స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఇందు కోసం బ్యానర్లలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. అయితే ఆచరణలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారే విమర్శలున్నాయి. కేవలం ప్రచారం కోసమే ఈ కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా అధికారులు నిర్వహిస్తు చేతులు దులుపుకొంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో కార్యాలయ, టమాటా మండీల పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని రైతులు అంటున్నారు. చెత్తకుప్పల్లో పేరుకుమాత్రం చెత్తతొలగించాని ఫోటోలు తీసుకొని ప్రచారం నిర్వహించుకొంటున్నారే తప్ప చిత్తశుద్ధితో కార్యక్రమం అమలు చేయడం లేదనే విమర్శలు రైతుల నుంచి వస్తున్నాయి. మార్కెట్‌యార్డులో ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తకుప్పలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా ఉజ్జనేశ్వరస్వామి ఉత్సవాలు



శివపార్వతులకు కల్యాణం చేస్తున్న వేదపండితులు



కురబ దేవర ఉత్సవాల్లో పాల్గొన్న నిసార్ అహ్మద్, తిప్పారెడ్డి

రామసముద్రం : మండలంలోని మట్లవారిపల్లి గ్రామంలోని కురబ దేవర ఆలయంలో వెలసిన శ్రీ సిగరేశ్వర, ఉజ్జనేశ్వర, బీరేశ్వర, బత్తేశ్వర స్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మూడు రాష్ట్రాలకు చెందిన కురబ కులస్తులకు కుల దేవుడు కావడంతో 13ఏళ్ల తర్వాత ఉత్సవాలు నిర్వహించారు. దీంతో వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయం చుట్టుపక్కల పొలాల్లో గుడారాలు వేసుకుని అన్నదానాలు చేశారు. అలాగే ఆలయం వద్ద శివ పార్వతుల కల్యాణోత్సవం గబ్బూరి బద్రీనాథ్, శ్రీనివాస జ్యూవెలరీ, రెడ్డివారి కుటుంబ సభ్యులు నిర్వహించారు. అలాగే ఆలయం వద్ద చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే కురబ కులస్తుల ఆనవాయితీ ప్రకారం భక్తుల తలపై టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఈ ఉత్సవాలు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ననుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కురబ దేవర ఉత్సవంలో..

మట్లవారిపల్లిలో ఆదివారం కురబ దేవర్ల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి మదనపల్లి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూజారులు వారికి అర్చనలు చేసి తీర్థ ప్రసాదాలు పంచి ఆశీర్వదించారు. వారు మాట్లాడుతూ 13 ఏళ్ల తర్వాత వైభవంగా కురబ దేవర ఉత్సవాలు పెద్ద జాతరను తలపించేలా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందడం పట్ల అభినందించారు. అనంతరం నాయకులు వారిని దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ గెవన్న, జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, కన్వీనర్ కేశవరెడ్డి, నాయకులు రెడ్డెప్ప నాయుడు, దొరబాబు, విజయ్, రెడ్డెప్ప, నాగప్ప, నారాయణ, చెంగప్ప, రెడ్డి శేఖర్ యాదవ్, అంబరీష్, నారాయణస్వామి, హరి, బాలాజీ, సుబోష్ తదితరులు పాల్గొన్నారు.

కురబ కులస్తుల అభివృద్ధికి కృషి

కురబ కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన మట్లవారిపల్లెలో జరిగిన కురబ దేవర్ల ఉత్సవాలకు హాజరయ్యారు. ఆయనకు నాయకులు, పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కురబ దేవర ఆలయంకు తాగునీటి బోరు, కమ్యూనిటీ భవనం మంజూరు చేయిస్తానని, అలాగే కనకదాసు విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

మాజీ జెడ్పీటీసీ సుభాష్‌రెడ్డి మృతి



సుభాష్ రెడ్డి (ఫైల్)

కురబలకోట/ మదనపల్లె: మండల రాజకీయాల్లో 25 ఏళ్ల పాటు ఓ వెలుగు వెలిగిన మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పీటీసీ ఎల్ సుభాష్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. పలువురిని దిగ్భ్రాంతికి గురి చేసింది. అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ మాత్రమే ఉండేది. ఇతను మండల టీడీపీ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. మండల ప్రజా పరిషత్ మండల తొలి ఎంపీపీగా ఇతను ఎన్నికయ్యారు. ఆ తర్వాత జెడ్పీటీసీగా కూడా కొనసాగారు. దశాబ్ద కాలంగా రాజకీయాలకు దూరమై తటస్థంగా ఉంటూ వచ్చారు.

మాజీ జెడ్పీటీసీకి నివాళి

కురబలకోట మాజీ జెడ్పీటీసీ సుభాష్‌రెడ్డి మృతదేహానికి ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుమార్తె అమెరికా నుంచి రావాల్సి ఉండటంతో మంగళవారం కురబలకోట మండలంలోని జంగావారిపల్లె వద్ద రేగడలోని వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

'యువపోరు' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీహెచ్.రామచంద్రారెడ్డి

రామసముద్రం : పేద విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తున్న కూటమిప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా విద్యార్థులు, యువత యువపోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సీహెచ్. రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్ష కట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదినెలలు కావస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా రాష్ట్రప్రజలను వంచనకు గురిచేస్తోందన్నారు. ఈనెల 12న రాయచోటి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే యువపోరును విజయవంతం చేసేందుకు విద్యార్థులు, యువత, వైఎస్సార్ సీపీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిరుపేదకు ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో గంగంపల్లి శివన్న కుటుంబీకులు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఇటీవల బాధిత కుటుంబీకులను పరామర్శించి రూ.50 వేల నగదును ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఈ నేపథ్యంలో సదరు డబ్బును ఆదివారం పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉమా శంకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, శివారెడ్డి, మధూకర్‌రెడ్డి, చలపతి, శీనా, రమణ, వెంకట్రమణ, గోపాల్, మద్దిరెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబీకులకు అందజేశారు.

'ఆవేదన' షార్ట్ ఫిల్మ్ ప్రారంభం



ఆవేదన షార్ట్‌ఫిల్మ్‌కు క్లాప్ ఇస్తున్న ప్రసాదరావు

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ సమస్యలను ఆధారంగా చేసుకుని 'ఆవేదన' షార్ట్ ఫిల్మ్‌ను స్థానిక బెంగుళూరు రోడ్డులోని జీఆర్టీ ఉన్నత పాఠశాలలో పాఠశాల కరస్పాడెంట్ కామకోటి ప్రసాదరావు క్లాప్ ఇచ్చి ప్రారంభించారు. షార్ట్ ఫిల్మ్ నిర్మాతలు సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మిలు మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్స్‌కు పలు సమస్యలను ఇతివృత్తంగా చేసుకుని సందేశం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఫిల్మ్ తీస్తున్నట్లు తెలిపారు. గతంలో కనువిప్పు సీరియల్ చేశామన్నారు. మంచి ఆదరణ లభించిందన్నారు. మంచి సందేశాత్మక చిత్రాలు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం ముందు శ్రీకృష్ణదేవరాయ జాతీయ అవార్డు అందుకున్న మునగోపాలకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు రాజేంద్ర, సీనియర్ సిటిజెన్స్ నాయకులు గొల్లపూడి తిరుపతిరావు, టీఎస్ఎ క్రిష్ణమూర్తి, ఉస్మాన్‌సాహెబ్, నాగభూషణరావు, శ్రీనివాసులు, నాగరాజు, శకుంతలమ్మ,మనోరమ పాల్గొన్నారు.

'మాలల సింహ గర్జన' విజయవంతం చేయాలి

నిమ్మనపల్లె : ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 23న తిరుపతిలో నిర్వహించే మాలల సింహగర్జన సభ విజయవంతం చేయాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు చింతపర్తి శివయ్య, సహాయ కార్యదర్శి వీరనాల మాణిక్యం అన్నారు. ఆదివారం మండలంలోని అగ్రహారం,నల్లగొండ,కొత్తపల్లి, బండమీద మాలపల్లి గ్రామాలలో హలో మాల- చలో తిరుపతి కరపత్రాలను ఆవిష్కరించారు. మాలలందరు సింహ గర్జన సభకు తరలి రావాలన్నారు. ఎస్సీ వర్గీకరణ వలన ఎంతో నష్టపోతామని, అదే విధంగా క్రిమిలేయర్ పెడితే ఇప్పుడు రిజర్వేషన్ పొంది ఉద్యోగాలు చేస్తున్న వారికి కూడా నష్టం కలుగుతుందన్నారు. మాల మేధావులు, అంబేడ్కర్ వాదులు, వివిధ మాల సంఘాల నాయకులు,మాల అనుబంధ సంఘాల నాయకులు విద్యార్థి సంఘాలు యువజన నాయకులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు నాయకులు ఎర్రయ్య, శ్రీరాములు, జయన్న, సుధాకర్,జయరాం, చంద్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ..కరుణించమ్మా



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: కరుణించమ్మా అంటూ భక్తులు మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లిని మొక్కుకొన్నారు. ఆదివారం ఆలయం భక్తుల రద్దీతో కిటికిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేషమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. ఆలయానికి సమీపంలోని కోనేట్లో భక్తులు పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ముందు సంతానం కోసం వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. అలాగే కొందరు భక్తులు ఆలయమెట్లకు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పొల్ట్రీ ఫారం మూసివేత

గాలివీడు : హైకోర్టు ఆదేశాలతో గ్రామసభ తీర్మానం మేరకు శ్రీ షిరిడీ సాయి పౌల్ట్రీ ఫారాన్ని మూసివేస్తున్నట్లు గోరాన్‌చెరువు పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు దిశానిర్దేశం చేసుకోవాలి

- ఏఎస్పీ వెంకట్రాది
- ఘనంగా ఏసీఈఫీఎస్టా 2కె 25



మాట్లాడుతున్న ఏఎస్పీ వెంకట్రాది

మదనపల్లె సిటీ: విద్యార్థులు దిశానిర్దేశం చేసుకుని విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సులభమని ఏఎస్పీ వెంకటాద్రి అన్నారు. ఆదివారం పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఏసీఈఫీఎస్టా 2కె 25 కాలేజీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు దురలవాట్లకు పాల్పడకూడదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్తులో ముందుకెళ్లాలన్నారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలన్నారు. అదే విధంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ప్రతి విషయంలోనూ విజయం సాధించవచ్చునన్నారు. అనంతరం కాలేజీ టాపర్లకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, తాలూకా సీఐ కళా వెంకటరమణ, కన్వీనర్, కో కన్వీనర్లు పాల్గొన్నారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని రచితారాయప్రోలు, ధనుంజయ్ సంగీత విభావరి అలరించింది.

వాటర్‌ప్లాంట్ మూసివేత



మూతబడిన వాటర్‌ప్లాంట్

పెద్దమండ్యం: పెద్దమండ్యంలో ఉచిత వాటర్‌ప్లాంట్ మూతబడింది. పది నెలలుగా వాటర్‌ప్లాంట్‌ను మూత వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పెద్దమండ్యం బస్టాండు కూడలిలో వార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఏపీఎండీసీ వారి ఆర్థిక సహకారంతో ప్లాంట్ ఏర్పాటు కావడంతో గ్రామంలోని ప్రజలు ఉచితంగా నీటిని తీసుకుని వెళ్లేవారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శుద్ధి చేసిన నీరు ప్రజలకు అందుబాటులో ఉండేది. ఇందుకోసం ఒక వ్యక్తిని నియమించారు. ఉదయం, సాయంత్రం ప్రజలు ఉచితంగా 200 వాటర్ క్యాన్‌లను తీసుకుని పోయేవారు. ఉచితంగా శుద్ధి చేసి నీటిని అందిస్తున్న వాటర్‌ప్లాంట్ మూతబడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే చింతల

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీ వంగిమళ్లవారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాస్ మల్లికార్జునరెడ్డి అన్న కుమారుడి వివాహం ఇటీవల జరిగింది. ఆదివారం వారి స్వగ్రామంలో నిర్వహించిన రిసెప్షన్ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు దినేష్‌రెడ్డి, రామకొండారెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, మధుసూదన్ రెడ్డి, యర్రమరెడ్డి, నీళ్ల భాస్కర్, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నగిరిమడుగు వెంకటరమణారెడ్డి కుమార్తె మనస్విని వాహహ కార్యక్రమం మదనపల్లి పట్టణంలో రామతులసి కళ్యాణమండపంలో జరిగింది. వివాహానికి హాజరైన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మదనపల్లిలోని శ్రీరస్తు కళ్యాణ మండపంలో వాల్మీకిపురం ఎల్ఆర్ వీధికి చెందిన రాయదుర్గం మోహన్‌రామ్ కుమారుడు నిశ్చితార్థ కార్యక్రమానికి వారిని ఆశీర్వదించారు. బి.కొత్తకోట మండలం తుమ్మనగుంటలో కె.రెడ్డిప్రసాద్ నూతన గృహ ప్రవేశానికి హాజరై వారికి అభినందనలు తెలియజేశారు.

కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేయరా?



అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనం

పెద్దమండ్యం: మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెలో కమ్యూనిటీ భవనం నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మాణం పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగా ఉన్న భవనం పశువులకు నిలయంగా మారింది. తురకపల్లె - వెలిగల్లు రహదారిపక్కనే గ్రామ పంచాయతీ భవనానికి సమీపంలో కమ్యూనిటీ భవనం నిర్మాణం చేపట్టారు. రూ. 10 లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణం పనులు జరిగాయి. అయితే భవన నిర్మాణం మోల్డింగ్ పూర్తి చేసి అలాగే వదిలేశారు. నిధులు చాలక పోవడంతో భవనం నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. తురకపల్లెకు కూతవేటు దూరంలో ఉన్న ఈ భవనం పశువులకు నిలయంగా మారింది. భవనంలో కొందరు మద్యం సేవిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. లక్షలు ఖర్చు చేసిన భవనం నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కమ్యూనిటి భవనం నిర్మాణంపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనం నిర్మాణాలు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ముగిసిన ఎల్లమ్మ తిరునాల

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లె, ఎల్లారెడ్డిగారిపల్లెలలో వెలసిన ఎల్లమ్మ తిరునాల ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఉత్సవాలలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు అభిషేకంలో నిర్వహించి రాత్రి ఆశాదివారిచే ఎల్లమ్మ హరికథ కాలక్షేపం నిర్వహించారు.